## హరిసింగ్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులో హరిసింగ్ రత్నావత్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ వీబీ నరసింహ పర్యవేక్షణలో 'నెట్‌వర్క్ ఇన్ట్రూషన్ డిటెక్షన్ ఇన్ హనీపాట్ ఫ్రేమ్ వర్క్ యూజింగ్ ఏఐ మోడల్స్'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి హరిసింగ్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన సూర్యాపేట జిల్లా చివ్వెముల మండలం ఎంజీనగర్ తండాకు చెందినవారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, విద్యార్థి నేతలు అభినందించారు.

## ఓయూ వీసీగా దళితుడినే నియమించాలి



నామ సైదులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: రాష్ట్రం లో ఎంతో ప్రతిష్టాత్మకమైన 107 వసంతా ల ఉస్మానియా యూనివర్సిటీకి వీసీగా దళితుడినే నియమించాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు డిమాండ్ చేశారు. 107 ఏళ్లలో ప్రభుత్వాలు ఒక్కసారికూడా దళితులకు అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు ఇప్పటివరకు ఓసీలు, బీసీలకు మాత్రమే అవకాశం కల్పించాయని చెప్పారు.

## రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయండి

కాచిగూడ: కాచిగూడ డివిజన్‌లోని లాల్‌బహుదూర్ స్కూల్ పక్కన నూతనంగా వేస్తున్న రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానికుల ఇబ్బందులను గుర్తించిన కార్పొరేటర్ ఉమాయాదవ్ శనివారం రోడ్డు పనులను పరిశీలించారు.

# ఏ పార్కు చూసినా..చెత్తా చెదారాలే

- నిర్వహణ లోపం..అపరిశుభ్రంగా పార్కులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఆహ్లాదానికి నోచుకోని స్థానికులు

బేగంపేట్, మే 18: బేగంపేట్ సర్కిల్ పరిధిలోని ఉద్యానవనాలు సరైన నిర్వహణ లేక అధ్వాహ్న స్థితికి చేరుకున్నాయి. నిత్యం పనిలో నిమగ్నమై కాస్త ఆహ్లాదం పొందాలని స్థానికులు పార్క్‌లకు వెళ్తుంటారు. సేద తీరేందుకు తీరా అక్కడికి వెళ్లాక పార్క్‌లన్ని చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, కూలిపోయిన చెట్లతో దర్శనమిస్తున్నాయి. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట్‌లో ఇటీవల డాన్‌బాస్కో దగ్గర ఓ పార్కు, బేగంపేట్‌లోని ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, చికోటి గార్డెన్స్ వద్ద ఈ మూడు పార్కులు కొంత వరకు అభివృద్ధి చేశారు. మోండా మార్కెట్ డివిజన్‌లలో పార్క్‌లు లేనేలేవు. కేవలం రాంగోపాల్‌పేట్, బేగంపేట్ డివిజలలోని సింధి కాలనీ, కృష్ణనగర్, జవహర్‌నగర్, వెంగళ్‌రావునగర్, పీజీ రోడ్డు, సింధి కాలనీ, మెక్లాడ్‌గూడ అలాగే ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, భగవంతపూర్, చికోటి గార్డెన్స్ ప్రాంతాల్లో మొత్తం కలిపి 10 పార్కుల వరకు ఉన్నాయి. ఇందులో ఇండియన్ ఎయిర్ లైన్స్ కాలనీ, చికోటి గార్డెన్స్, రాంగోపాల్‌పేట్‌లోని వెంగళ్‌రావు నగర్ పార్క్‌లు మినహా మిగిలినవన్ని పూర్తిగా అధ్వాహ్న స్థితికి చేరుకున్నాయి. బేగంపేట్ సర్కిల్, హార్టికల్చర్ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యహరిస్తున్నారు.



రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని మెక్లాడ్‌గూడ పార్కులో ఎండిపోయిన చెట్లు



### మంత్రి ఆదేశించినా ..

గతంలో మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ పార్కుల అభివృద్ధిపై నిత్యం పర్యవేక్షిస్తూ నిధులు మంజూరు చేయిస్తున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తూ సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అందుకు నిదర్శనం మెక్లాడ్‌గూడ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని నాలుగేండ్ల క్రితం జూన్ 15న అధికారులను ఆదేశించారు. మైదానం చుట్టు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని అలాగే అందులో మొక్కలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

### ఒక్కొక్కటిగా .. అభివృద్ధి చేస్తున్నాం

*బేగంపేట్ సర్కిల్ పరిధిలోని కొన్ని పార్క్‌లను ఇప్పటికే అభివృద్ధి చేశాం. కొన్ని పార్క్‌లలో పూల మొక్కలు, వాకింగ్ ట్రాక్‌లను, బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేశాం. పార్క్‌లలో కూలిపోతున్న చెట్లను, చెత్తా చెదారాలు తొలగిస్తున్నాం. సాధ్యమైనంత త్వరగా పార్క్‌ల నిర్వహణతో పాటు అభివృద్ధికి పూర్తిగా కృషి చేస్తాం.*

– గణేశ్, హార్టికల్చర్ అధికారి బేగంపేట్ సర్కిల్

## వీసీల నియామకంలో పారదర్శకత పాటించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీతేజ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీ వీసీల పదవీ కాలం ముగియనుండడంతో ప్రభుత్వం చేపట్టబోయే వీసీల నియామకాలలో పారదర్శకత పాటించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీ తేజ డిమాండ్ చేశారు. వీసీల ఎంపికలో ఎలాంటి పైరవీలకు తావులేకుండా అన్ని అర్హతలు ఉన్న వ్యక్తులనే వీసీలుగా నియమించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పృథ్వీతేజ మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులను వీసీలుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. నియామకాలు పూర్తి అయిన తరువాత వర్సిటీలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు.






## 'డాక్టర్ రవీందర్‌నాయక్ ఆశయాలను కొనసాగిద్దాం'



డాక్టర్ రవీందర్‌నాయక్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: గిరిజన హక్కుల నేత, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఓయూ కేంద్రంగా క్రియాశీలకంగా పనిచేసిన డాక్టర్ రవీందర్‌నాయక్ 5వ వర్ధంతి సభను ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో రవీందర్‌నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. మారుమూల తండా నుంచి వచ్చి డాక్టరేట్ సాధించిన ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్రునాయక్, వివిధ సంఘాల నాయకులు డాక్టర్ కరాటే రాజునాయక్, డాక్టర్ నెహ్రూ నాయక్, డాక్టర్ సంపత్‌నాయక్, సుబ్బునాయక్, డాక్టర్ వెంకటేశ్ చౌహాన్, సంజీవ్‌నాయక్, దత్తాత్రేయ, రాజారాంనాయక్, విష్ణు, శరత్‌నాయక్, విజయ్, రమేశ్‌రాథోడ్, అశోక్‌నాయక్, విజయేందర్, ప్రేమ్, వెంకటేశ్, లింగ, జైపాల్, ప్రకాశ్, మహేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

## వీసీలుగా మాదిగ ప్రొఫెసర్లను నియమించాలి



ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించనున్న నేపథ్యంలో రెండు వర్సిటీలకు మాదిగ ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ డిమాండ్ చేశారు. ఓయూ లేదా జేఎన్టీయూ వీసీ పదవితో పాటు ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమించడంలో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంఎస్‌ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొమ్ము శేఖర్ హాజరై మాట్లాడుతూ.. పరిపాలనా అనుభవం, సీనియారిటీ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అన్ని అర్హతలు కలిగి ఉన్న మాదిగ ప్రొఫెసర్లను గౌరవించాలని కోరారు. ఇప్పటికైనా మాదిగలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులు మంద రాజు, గుండాల రవితేజ, బొల్లికొండ వేణు, కోల హరీశ్, సంతోష్, రవి, ప్రదీప్, రమేశ్, నవీన్, రామకృష్ణ, సైదులు పాల్గొన్నారు.






## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,మే 18:కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లిలోని చిన్న తోకట్టలో గండి మైసమ్మ ఆలయ నిర్మాణానికి శనివారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దాతల సాయంతో ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.సాంకేతికంగా పురోగమిస్తున్నప్పటికీ, కొందరు మూఢ నమ్మకాలను విశ్వసిస్తూ భక్తికి,ఆధ్యాత్మికతకు దూరం ఉంటున్నారన్నారు.ప్రజలు భక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జాజుల క్రాంతి,ముఖేష్ యాదవ్,అశోక్ ముదిరాజ్,సీతారాం,నిత్యానంద,పరమేష్, అజయ్, జగత్, సాయి, మీనా భాస్కర్, హేమ, అనురాధ,విజయ్ కుమార్, వేణు, వరప్రసాద్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



ఉప్పల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షులు శ్రీధర్ గుప్తా, తదితరులు

అడ్డగుట్ట, మే 18 : ఆర్యవైశ్య సంఘం మెట్టుగూడ ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ టూరిజం డెవలప్‌మెంటు మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తాను సంఘం అధ్యక్షులు శ్రీధర్ గుప్తా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జయంతి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం కుంకుమార్చన, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించామని, మెట్టుగూడ అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ గుండా రమేష్, అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి వీరేశ్ బాబు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ అధ్యక్షులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీకాం త్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బస్తీల్లో పేరుకుపోయిన మట్టి తొలగింపు

అంబర్‌పేట, మే 18 : భారీ వర్షానికి బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బుర్జుగల్లీ, ప్రభుత్వ దవాఖాన ప్రాంతాలలో బురద, మట్టి విపరీతంగా చేరింది. స్థానికులు నడవడానికి వీలు లేకుండా రోడ్డును బురద కప్పేసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ బి.పద్మ, సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి శనివారం ఆ బస్తీలకు వెళ్లారు. పారిశుధ్య కార్మికులను పిలిపించి రోడ్లపై చేరిన బురద, మట్టి, చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడ మట్టి, చెత్త, బురద పేరుకుపోయినా తొలగింపజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కాశ్వరెడి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది రవి, లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు గోవిందు అర్జున్ పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



షబానా బాను (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: టిఫిన్ చేసేందుకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పార్సిగుట్ట సంజీవపురంలోని రాఘవ గార్డెన్స్ సమీపంలో షబానా బాను (40) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నది. ఈ నెల 16న ఉదయం పది గంటలకు తాను సంజీవపురంలో టిఫిన్ చేస్తానని కూతురు హుమేరా సదియాకు చెప్పి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రదేశాల్లో వెతికారు. పారుగింట్లో నివాసముండే వ్యక్తి షబానాను ఉదయం టిఫిన్ సెంటర్ వద్ద వేరే వ్యక్తితో ఉన్నట్లు చూశానని చెప్పడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### 21న పురస్కారాలు-2024

రవీంద్రభారతి, మే18 : సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 21న మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్, కృష్ణ, దాసరి నారాయణ రావు ల పురస్కారాలు -2024 , సీల్‌వెల్ సినీ సుస్వరాలు కార్యక్రమం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఆమని తెలిపారు. ప్రముఖ సినీనటుడు ఎ. మురళీమోహన్, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.



*అభినందనలు: పదో తరగతి ఫలితాల్లో బోయిన్‌పల్లి సీఎంఆర్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఎనిమిది మంది విద్యార్థులు ఆశ్రిత, ప్రణవి, లికీష, అలైస తస్లీమ్, అక్షర, ప్రద్యుమ్న,రామ్ష, శివరాంలు 10/10 జీపీఏ సాధించారు. 60 శాతం మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్ మార్కులతో ఉతీర్ణులయ్యారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఫౌండర్ చైర్మన్ మల్లారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10/10 సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 5 వేల చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్‌కే రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేశ్వరి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.*



ట్రాఫిక్ జామ్: శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి తార్నాకలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు గంటల కొద్ది ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

## మధుమేహంపై అవగాహన పెంచుకోవాలి

కాచిగూడ,మే 18: మధుమేహంపై అవగాహన లేక ప్రజలు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. 80శాతం మందికి ఎఫ్‌బీఎస్ 120 నుంచి 170వరకు, పీఎల్‌బీఎస్ 190 నుంచి 280 వరకు నార్మల్ కంటే ఎక్కువగా ఉంటుంది. ప్రధాన కారణం మధుమేహంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం, ఆహార నియమాలు పాటించకపోవడం, ప్రతి రోజూ వ్యాయామం చేయకపోవడమేనని పేర్కొన్నారు.

మధుమేహం ఉన్నవారు అనారోగ్య సమస్యలకు గురికాకుండా హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాయామం, ఆహార నియమాలపై కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 994923 8492 లో సంప్రదించాలని కోరారు.

## సుందరయ్య పార్కులో.. వరదనీటిని తొలగించాలి

చిక్కడపల్లి, మే 18 : బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో వాకింగ్ ట్రాక్ వర్షానికి పూర్తిగా వరదనీటితో నిండిపోయింది, దానిని వెంటనే పునరుద్ధరించాలని హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ప్రధాన కార్యదర్శి వీరయ్య అన్నారు. గురువారం వర్షానికి ట్రాక్ మొత్తం వరనీటితో నిండిపోయిందని తెలిపారు.

దీంతో వాకింగ్ చేయడానికి వీలు లేకుండా పోయిందని, కోట్లాది రూపాయలతో పార్కును అభివృద్ధి చేసి వరద నీరు పోవడానికి వీలు కల్పించకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఈ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.





భారీ వర్షం, అవస్థలు: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి నగర ప్రజలు అతలాకుతలమవుతున్నారు. శనివారం సాయంత్రం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని తార్నాక, మెట్టుగూడ పరిసర ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. దీంతో ఆ ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.